TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 56 | మంగళవారం, సెప్టెంబర్ 08, 2026 , | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 56 | 08-09-2026 (TUESDAY) | PAGES: 4 | RS : 5/-

### వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు

## పూర్తి చేస్తాం



హైదరాబాద్ :వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

### తెలంగాణలో కోటి ఓట్ల

# తొలగింపునకు కుట్ర


- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ?
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



హైదరాబాద్ :తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లుతన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు.బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

### రాజకీయ నాయకులు

## వర్తమానాన్ని అర్థం చేసుకోవాలి



అమరావతి:ఇప్పుడు ఎన్నికలు జరిగినా కూటమిదే విజయమని సీఎం చంద్రబాబు అన్నారు. సర్వేలన్నీ కూటమికే అను కూలంగా ఉన్నాయని టీడీపీ నేతల్లో ఆయన జోష్ నింపారు. అమరా వతిలో జరుగుతోన్న తెలుగు దేశం పార్టీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నాయ కులు, పార్టీ ప్రజాప్రతినిధులకు చంద్ర బాబు దిశానిర్దేశం చేశారు. కూటమి లో ఐకమత్యం కీలకమని . గిల్లిక జ్జాలతో రచ్చకెక్కొద్దంటూ నేతలకు హితబోధ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాల యంలో నిర్వహించిన లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌కు ఆయన హాజరయ్యారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆ తర్వాత శిక్షణ తరగతులకు హాజరైన ఎమ్మెల్యేలకు రాజకీయాలపై పలు సూచనలు చేశారు. పరిష్కారం అయ్యేవరకూ ప్రయత్నించాలి: రాజకీయ నాయకులు వర్తమానాన్ని అర్థం చేసుకోవాలని చంద్రబాబు కోరారు. అనేక అవకాశాలు మన వద్ద ఉన్నాయని, వాటిని నాయకులు అందిపుచ్చుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నివేదిక తయారు చేస్తామని, అనేక రకాల పెట్టుబడులు విశాఖ రీజియన్‌కు తీసుకు వస్తున్నామన్నారు. నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, దీనిపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటూనే రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలవరం ఎడమ కాల్వ ప్రారంభోత్సవాల్లో ప్రజలు భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గాల్లో పరిపాలనా వెసులుబాటు కోసం ప్రత్యేక కార్యాలయం, 9 మంది సిబ్బందిని కేటాయించామని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్‌లు ఇచ్చామని వివరించారు.

### రాంచందర్‌రావు అరెస్ట్..

## తోపులాట ఉద్రిక్తత



హైదరాబాద్, సెప్టెంబర్ 7: తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. (సోమవారం) ఉదయం నుంచి దశల వారీగా అసెంబ్లీ ముట్టడికి వస్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు ఎప్పటికప్పుడు అరెస్ట్ చేస్తున్నారు. వరుసగా అసెంబ్లీ ముట్టడికి కమలం పార్టీ నేతలు రావడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. మరోసారి అసెంబ్లీ ముట్టడికి బీజేపీ యత్నించడంతో.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సహా పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.రాంచందర్‌రావు అరెస్ట్ సందర్భంలో తోపులాట చోటు చేసుకుంది. దీంతో గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ తెలంగాణ చీఫ్‌ను పోలీసులు తీసుకెళ్లకుండా రోడ్డుపై పడుకుని మరీ బీజేవైఎం నేతలు నిరసనకు దిగారు. రాంచందర్ రావును తీసుకెళ్తున్న పోలీస్ వాహనంపైకి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఎక్కడంతో.. వెంటనే పోలీసులు అతడిని లాగి పడేశారు. ఆ వెంటనే పలువురు కార్యకర్తలు కారుకు అడ్డంగా పడుకున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో అసెంబ్లీ వద్ద బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కార్యకర్తలకు చేతులు విరగగా, పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. వరుసగా బీజేపీ నేతల ముట్టడితో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది.

### 22 ఏ అంశంపై

## చర్చకు సిద్ధంగా ఉన్నాం



హైదరాబాద్ :22 ఏపై విచారణ జరిపించాలని అసెంబ్లీలో బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. భూ దందాపై విచారణ జరిపించాలని బీజేపీ సభ్యుల నినాదాలు చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.సభ సజావుగా సాగేందుకు సహకరించాలి : బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటా మని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధ ర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యే లు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచా రణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు.

### అసెంబ్లీ వద్ద

## బీఆర్ఎస్ బిగ్ ఫైట్.

హైదరాబాద్:తెలంగాణ అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారి తీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు.ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ డ్రెస్‌లో అసెంబ్లీకి వచ్చారు. అయితే నల్ల దుస్తులతో లోపలికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు.లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు నేతలు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలకు గాయాలైనట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా? అని నిలదీశారు. ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించకుండా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.టీషర్టులు ధరించడంపై



పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరిస్తే తప్పు లేనప్పుడు తమకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని నిలదీశారు.పిల్లలకు ఉద్యోగాలు అడిగితే విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇదేం పాలన? అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. తాజా పరిణామాలతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## 'నా చీర లాగేశారు'

### అసెంబ్లీ గేటు వద్ద సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు



హైదరాబాద్:తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమం లో తన చీర లాగేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తన కాలికి కూడా గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నల్ల షర్టులు, మహిళా నేతలు నల్ల చీరలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే వారికి ప్రవేశం లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.తన చీర లాగడం బాధ కలిగించిందని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్న మహిళలకే రక్షణ లేకపోతే బయట ఉన్న మహిళలకు వీళ్లు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. తన కాలికి గాయమైందని తెలిపారు.తాము అసెంబ్లీకి వస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న భయంతోనే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.మరోవైపు అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి గాయాలైనట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**డాక్యుమెంట్ పోయినది**

పుట్టపాక నాగరాజు (తండ్రి : కొండలు), చెన్నరిగూడెం, బెతవోలు, చిల్కూరు, సూర్యాపేట జిల్లా వారికి చెందిన డాక్యుమెంట్ నెంబర్. 7159/1988, సబ్ రిజిస్టర్ ఆఫీస్, ఉప్పల్ (1507) ఒరిజినల్ డాక్యుమెంట్ 25-08-2026న తుంకిమెట్ల -- కొడంగల్ మార్గంలో పోయినది. ఎవరికైనా దొరికినచో సంప్రదించండి 9494241561

మంగళవారం,
సెప్టెంబర్ 08, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# అసైన్మెంట్ భూముల్లో దళితులకు హక్కులు కల్పించాలి

**- సర్వే నంబర్ 472లో 32 ఎకరాలు**
**- తిరిగి స్వాధీనం చేసుకోవడంతో 100 కుటుంబాలకు జీవనోపాధి కరువు**
**- బౌరంపేటలో దళితుల ధర్నా.. తహసీల్దార్‌కు వినతి**



**ఆదాబ్ సైబరాబాద్, దుండిగల్ :** బౌరంపేటలోని సర్వే నంబర్ 472లో ఉన్న అసైన్మెంట్ భూములపై దళితులకు హక్కులు కల్పించాలని బౌరంపేట మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం బౌరంపేటకు చెందిన దళితులతో కలిసి దుండిగల్ గండి మైసమ్మ మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆమె ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ము మంగమ్మ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 472లో దాదాపు 75 ఏళ్లుగా దళితులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే ఎలాంటి పునరావాసం కల్పించకుండానే రాష్ట్ర ప్రభుత్వం 32 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో సుమారు 100 దళిత కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**- దళితులకు ఒక న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?**

రాష్ట్రంలో ఇతర వర్గాలకు ఒక విధంగా, దళితులకు మరో విధంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాదని మంగమ్మ విమర్శించారు. పక్కనే ఉన్న దుండిగల్‌లో అసైన్మెంట్ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటున్న సందర్భంలో అసైనీలకు ప్రతి ఎకరాకు 700 గజాల అభివృద్ధి చేసిన ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తున్నారని తెలిపారు. అదే విధంగా బౌరంపేటలో భూములు కోల్పోతున్న దళిత కుటుంబాలకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న దళితులు తమకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే సమయంలో ఇన్నాళ్లుగా ఆ భూమిపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా భూమి లేదా తగిన పునరావాసం కల్పించాలని కోరారు.

**- విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తామని తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు**

ధర్నాలో దళిత నాయకులు డప్పు కృష్ణ, బాలగారి నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బాలగారి మల్లేష్, చింతకింది రాములమ్మ, అగ్రి నరసింహతో పాటు పెద్ద సంఖ్యలో దళితులు పాల్గొన్నారు.

# ఆర్ఎంసి రెడ్ మిక్స్ వద్దు... ప్రజల ప్రాణాలు ముద్దు

**-వాతావరణ కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి**
**-సంబంధిత అధికారులు పర్మిషన్ ఇవ్వొద్దు..క్రషర్ ప్లాంట్ నిర్మాణం జరగొద్దు**
**-చేవెళ్ల మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్, ఎమ్మార్వోకు వినతిపత్రం అందించిన జాజుగుట్ట ప్రజలు**



**ఆదాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ 11వ వార్డులోని ఎస్ఏ గార్డెన్, జాజుగుట్ట ఇండ్ల కు మధ్యన నూతనంగా చేపడుతున్న ఆర్ఎంసి రెడ్ మిక్స్ క్రషర్ ప్లాంట్ తో తీవ్రమైన దుమ్ము దూళి విస్తరిస్తుందని, ఆ దుమ్ముదులి తో వాతావరణం కలుషితమై ఇండ్లలో ఉన్న చిన్నపిల్లలు వృద్ధులు పెద్ద మొత్తంలో అనారోగ్య సమస్యలకు గురవుతారని, ఇలాంటి మినీ ఇండస్ట్రియల్ ను ప్రజలకు దూరంగా ఉండేలా చూడాలని, వెంటనే రెడ్ మిక్స్ క్రషర్ ప్లాంట్ నిర్మాణాలను నిలిపివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి, చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ రాజేందర్ కు సోమవారం జాజుగుట్ట ప్రజలంతా కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో... 11 వ వార్డు కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, నక్కలపల్లి మల్లేష్ యాదవ్, బి.దశరథ్, ఎండి జాహెద్, జగన్ గౌడ్, ఎండి హైమద్, మైమూద్, కాలేద్, రవీందర్ గౌడ్, చాన్ పాషా, దాతర్, దేవేందర్ గౌడ్, కలీమ్, షేక్ హైమద్, రఫిక్, నహెద్, రషీద్, అఫ్రోజ్, తోన్ రియాజ్, అజ్మత్, గౌస్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ '420' హామీలను వెంటనే అమలు చేయాలి

**-అబద్ధపు హామీలతో గద్దెనెక్కి కాలయాపన చేస్తున్న సీఎం**
**-కెసిఆర్ పాలనలో సంక్షేమ పథకాలను నిలిపి ప్రజల పొట్ట కొడుతుండ్రు**
**-ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి**
**-చేవెళ్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు**



**ఆదాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ అధిష్టానం ఇచ్చిన 7 రోజుల నిరసన పిలుపులో భాగంగా, సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ప్రజావాణి కేంద్రంలో ఆర్డీవో కు కాంగ్రెస్ 420 హామీల తక్షణ అమలుకై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజలను దగా చేసి గద్దెనెక్కి కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు సరికాదని తీవ్రంగా మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు పెంపు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి ప్రధాన హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను నిలిపివేసి పేద, మధ్యతరగతి ప్రజల పొట్ట కొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో.. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ దేశమల్ల ఆంజనేయులు, మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, మున్సిపల్ కౌన్సిలర్స్ దూత మల్లేష్, దప్పు సువర్ణ చందు, కురువ మంగమ్మ మల్లేష్, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి,నియోజకవర్గ యువజన అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, ఎండి జాహెద్, బ్యాగరి నర్సింలు, సుదర్శన్, ఎన్ .కృష్ణారెడ్డి, డి.సత్యం, ఊరడి రాంప్రసాద్, బ్యాగరి అనిల్, కడమంచీ ఆనంద్, టి.యాదయ్య, సర్పంచ్ మల్లరెడ్డి,వెంకటేశ్వర రెడ్డి,రామ గౌడ్, ఊరెళ్ళ మాజీ సర్పంచి నర్సింలు, సిహెచ్. కృష్ణ, మాజీ సర్పంచ్ శివారెడ్డి,రఘురెడ్డి, మాధవ్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురువే జ్ఞానజ్యోతి.. సమాజానికి మార్గదర్శి





**ఆదాబ్ సైబరాబాద్, శేరిలింగంపల్లి:** సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకే అత్యున్నత స్థానం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువేనని అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమ వారం శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

**- 35 మంది ఉపాధ్యాయులకు సన్మానం**

ఈ సందర్భంగా శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, గురుకుల కళాశాలలు, జవహర్ నవోదయ విద్యాలయం, విశ్వవిద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 35 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారు. శాలువ, జ్ఞాపిక, పగిడి, తాంబూలాలతో వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా సన్మానం చేశారు.
ఈ సందర్భంగా ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి విద్యే ప్రధాన ఆధారమన్నారు. గురువు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, మానవతా విలువలు, నైతికత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారని తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఉపాధ్యాయుడికీ ఆదర్శమన్నారు. నేటి ఉపాధ్యాయులు నూతన విద్యా విధానంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేసి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. భారతీయ సనాతన సంప్రదాయంలోని గురుశిష్య బంధం, నైతిక విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.
కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ చంద్రారెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బసవలింగం, ఉపాధ్యాయులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, ఉమా చంద్రశేఖర్, జి.వి.రావు, బాలన్న, సుజాత, వీణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బిల్డర్, సామాజిక కార్యకర్త తూనిక రాఘవేంద్రరావు, యు.వి. రమణమూర్తి సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు.

## జగద్గిరిగుట్టలో బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దహనం

**- పోలీసులపై దాడులు, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన**



**అదాబ్ సైబరాబాద్, జగద్గిరిగుట్ట :** భూదేవి హిల్స్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, టాటా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు. శాసన సభలో పోలీసులపై దాడులు చేయడం, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. గడ్డం శ్రీనివాస్, కవ్వాలి చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోల్మన్ రాజు, అరుణ్ కుమార్, షేక్ షరీఫ్, గడ్డం ప్రసాద్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీల అమలుకు కలెక్టర్‌కు ఫిర్యాదు

**- జవహర్‌నగర్ నుంచి తాంద్ర జలందర్ మరియు బిఆరెస్ నాయకుల వినతిపత్రం**



**అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ తాంద్ర జలందర్‌తో పాటు జవహర్ నగర్ బిఆరెస్ నాయకులు మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12 వేల సాయం, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు--భృతి, విద్యార్థులకు విద్యా భరోసా, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ పెంపు తదితర హామీలను అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు, బండకింది ప్రసాద్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట



**అదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం నిరసనలు చేపట్టాయి. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఎంఆర్ఓలకు ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించారు. హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, శాంతి, శ్రీనివాస్ రెడ్డి, సబిత, అనిల్ కిషోర్ గౌడ్ తదితరులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో కొత్త బజాజ్ పల్సర్ బైక్‌ల ఆవిష్కరణ





**ఆదాబ్ సైబరాబాద్,మేడ్చల్:** మేడ్చల్‌లోని శ్రీ వెంకట సాయి మోటార్స్‌లో మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన బజాజ్ పల్సర్-150, పల్సర్-125 బైక్‌లను మేడ్చల్ ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకట సాయి మోటార్స్ యజమాని కళ్యాణ్, ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్‌తో పాటు ఎస్సై పరశురాంను శాలువాతో ఘనంగా సన్మానిం చారు. కొత్త మోడళ్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1.11,116 లక్షల విరాళం ఇచ్చిన మోడేపల్లి కృష్ణమాచారి దంపతులు



**అదాబ్ సైబరాబాద్,ఖమ్మం/వైరా:** వైరాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ జగద్గురు విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, ఆయన ధర్మపత్ని యమునా దంపతులు రూ.1,11,116 విరాళాన్ని సమర్పించారు. ఆలయ మండపం గ్రిల్స్ నిర్మాణం నిమిత్తం ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కృష్ణమాచారి--యమునా దంపతుల సేవాభావాన్ని అభినందించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి అందించిన సహకారానికి ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రాక్షల నరసింహచారి, కమిటీ సభ్యులు అనంతచారి, తూమాటి శ్రీరాములు, బ్రహ్మాచారి, రంగు శ్రీనివాసరావు, రూపాచారి తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD
మంగళవారం, సెప్టెంబర్ 08, 2026



## గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు






- మండపాలపై నిరంతర నిఘా.. నిమజ్జన రూట్లపై ముందస్తు పరిశీలన
- వదంతులు, తప్పుడు సమాచారంపై ప్రత్యేక దృష్టి : డీజీపీ సీవీ ఆనంద్

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** గణేష్ ఉత్సవాలు--2026ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా, బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల భద్రతా ఏర్పాట్లపై సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పాల్గొన్నారు.గణేష్ మండపాలు, నిర్వాహకులు, వాహనాలు, సీసీ కెమెరాలు, నిమజ్జన రూట్లకు సంబంధించిన వివరాలను పోలీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. ప్రతి మండపాన్ని పోలీసులు క్రమం తప్పకుండా సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించాలని ఆదేశించారు.

### - సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన రూట్లను ముందస్తుగా పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, పార్కింగ్, రూట్ డైవర్షన్ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### - నిర్వాహకులతో సమన్వయం

గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో పోలీసులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలని డీజీపీ సూచించారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే వదంతులు, తప్పుడు సమాచారంపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ప్రజల సహకారంతో ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రాతో పాటు అదనపు ఎస్పీ రాజేష్ మీనా, జిల్లాలోని పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి బిడ్డ సంజనకు డాక్టర్ సీటు



- ఘనంగా సన్మానించిన గ్రామపంచాయతీ

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** పేద, అణగారిన వర్గాల కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఎన్కతల గ్రామానికి చెందిన సంజనను గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం సంజనను శాలువాతో సత్కరించి, అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ సంజన ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఆమె కుటుంబానికే కాకుండా మొత్తం ఎన్కతల గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సవాళ్లు ఎన్ని ఎదురైనా పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సంజన తన విజయంతో నిరూపించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, ముఖ్యంగా యువతులు సంజనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. చదువే జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధమని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడంలో ఎలాంటి వెనుకడుగు వేయకూడదని అన్నారు. సంజన విజయం గ్రామంలోని మరెంతో మంది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని, ఆమె బాటలో మరిన్ని కుటుంబాల నుంచి విద్యార్థులు ఉన్నత చదువుల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు విద్య అందని రోజుల్లోనే వారికి విద్య, సమానత్వం, హక్కులు కల్పించేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహోన్నతమైన పోరాటం చేశారని గుర్తుచేశారు. మహిళలు చదువుకుంటేనే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని అంబేద్కర్ బలంగా విశ్వసించారని అన్నారు.

మహిళలకు విద్యా హక్కు, సమాన హక్కులు, గౌరవంగా జీవించే అవకాశాల కోసం అంబేద్కర్ చేసిన కృషి ఫలితంగానే నేడు సంజన వంటి ఎంతోమంది మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి వైద్యులు, ఇంజనీర్లు, అధికారులు వంటి ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారని మల్లేశం అన్నారు."అవకాశం లభిస్తే అణగారిన వర్గాల పిల్లలు కూడా ఆకాశమే హద్దుగా ఎదగగలరని సంజన నిరూపించిందన్నారు. ఒకప్పుడు మహిళలకు చదువు అందని పరిస్థితులు ఉన్న ఈ దేశంలో, నేడు ఒక గ్రామీణ యువతి ఎంబీబీఎస్ సీటు సాధించి డాక్టర్‌గా ఎదగబోతుండటం అంబేద్కర్ ఆశయాలకు ప్రతిబింబమన్నారు. సంజన విజయం కేవలం ఒక విద్యార్థి విజయం కాదని గ్రామీణ, అణగారిన వర్గాల యువతలో కొత్త ఆశలను నింపే విజయం" అని కట్టెల మల్లేశం అన్నారు.

సంజన భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఆమె విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి గ్రామం నుంచి మరింత మంది విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు, యువత, ప్రజలు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ప్రముఖ నాయకులు లంబడి సురేష్, శనేశ్వర ఆలయం కమిటీ చైర్మన్ పట్లోళ్ల మహిపాల్ రెడ్డి. మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు మేతరి శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు డప్పు పోచయ్య, తలారి ఆనంద్ గ్రామపంచాయతీ సిబ్బంది, పలు యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో.. ఐదు కేసులకు చెక్

- రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం స్వాధీనం..
- రూ.10 లక్షల విలువైన బ్యాటరీలు రికవరీ
- జగద్గిరిగుట్ట పోలీసులను అభినందించిన ఉన్నతాధికారులు
- రివార్డులతో సత్కారం




**ఆదాబ్ సైబరాబాద్, జగద్గిరిగుట్ట:** నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన జగద్గిరిగుట్ట పోలీసులు రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి చోరీ, మోసం ద్వారా అపహరించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మోసం కేసులో రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, ఇళ్ల దొంగతనాల కేసులో మొబైల్‌ఫోన్, బంగారం, రూ.10 లక్షల విలువైన నాలుగు బ్యాటరీలను రికవరీ చేశారు.

### ■ నమ్మించి.. నగదు, బంగారం స్వాహా

మోసం, ఐటీ చట్టం కింద నమోదైన కేసులో మార్కాపురం ప్రాంతం అక్కపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి శివమోహన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సుమారు 12 ఏళ్లపాటు సశస్త్ర సీమాబల్(ఎస్‌ఎస్‌బీ)లో కానిస్టేబుల్‌గా పనిచేసిన అతడు.. విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తన, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో సర్వీసు నుంచి తొలగించబడినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై పలువురితో పరిచయాలు పెంచుకున్నాడు. వారి నమ్మకాన్ని సంపాదించి డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలోనూ మార్కాపురం, గిద్దలూరు పోలీస్‌స్టేషన్లలో అతడిపై మోసం కేసులు నమోదైనట్లు గుర్తించారు.ప్రస్తుత కేసులో బాధితురాలితో ఫోన్ ద్వారా పరిచయం పెంచుకున్న నిందితుడు.. కొంతకాలం సన్నిహితంగా ఉంటూ నమ్మకం కల్పించాడు. తనకు, కుటుంబ సభ్యులకు అవసరాలు ఉన్నాయని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పి పలు దఫాలుగా సుమారు రూ.9 లక్షలు తీసుకున్నాడు. 3.5 తులాల బంగారాన్ని కూడా తీసుకుని కంభంలోని కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

### ■ 15 రోజుల్లో మూడు ఇళ్లలో చోరీ

అస్బెస్టాస్ కాలనీలో గత 15 రోజులుగా రాత్రివేళల్లో వరుసగా జరుగుతున్న ఇళ్ల దొంగతనాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు గరికపాటి వెంకటేష్‌ను అరెస్టు చేశారు. నిందితుడు మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు తేలింది.ఒక ఇంట్లో మొబైల్‌ఫోన్, మరో ఇంట్లో వెండి వస్తువులు, ఇంకో ఇంట్లో 3 గ్రాముల బంగారం, రూ.60 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. అతడి వద్ద నుంచి మొబైల్‌ఫోన్, 3 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

### ■ రూ.10 లక్షల బ్యాటరీలు చోరీ

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈవీ ఛార్జింగ్ కేంద్రంలో నాలుగు బ్యాటరీలు చోరీకి గురైన కేసులో తోట గురువప్పను పోలీసులు అరెస్టు చేశారు. ఛార్జింగ్ కేంద్రం సూపర్‌వైజర్ మహేష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నిందితుడు బ్యాటరీలను స్క్రాప్ దుకాణంలో విక్రయించి.. వచ్చిన డబ్బుతో గిద్దలూరుకు వెళ్లిపోయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ.2 .50 లక్షలు కాగా.. నాలుగు బ్యాటరీల విలువ రూ.10 లక్షలు. ప్రత్యేక బృందాన్ని గిద్దలూరుకు పంపిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి నాలుగు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు.

### ■ సాంకేతికతతో ఛేదింపు

డీసీపీ కుత్బుల్లాపూర్ ఆదేశాల మేరకు, ఏసీపీ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో కేసుల దర్యాప్తు సాగింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుల ఆచూకీ గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.కేసుల ఛేదనలో ఇన్‌స్పెక్టర్ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రరెడ్డి, ఏఎస్సై రామ్‌కుమార్, పీసీలు నరేష్ గౌడ్, రమేష్, డబ్ల్యూపీసీ సుమ తదితరులు కీలకంగా వ్యవహరించారు. వారి పనితీరును ఉన్నతాధికారులు అభినందించి రివార్డులతో సత్కరించారు.

## ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ శాంతియుత ర్యాలీలో పాల్గొన్న తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మై పతి అరుణ్ కుమార్

- ఆదివాసులతో దద్దరిల్లిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ తుడుందెబ్బ ఆధ్వర్యంలో
- ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్--ముట్టడి భారీ నిరసన కార్యక్రమం విజయవంతం
- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసులు ఏటూర్‌నాగారం



**ఆదాబ్ సైబరాబాద్,ములుగు :**ఆదివాసుల హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్--ముట్టడి కార్యక్రమం భారీగా విజయవంతమైంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసులు, యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 5వ షెడ్యూల్, పీసా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు. ఆదివాసీ యువతకు ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు ఆదివాసీ ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

వేలాది మంది ఆదివాసులు ఏటూర్‌నాగారం ఐటీడీఏకు తరలిరావడంతో ప్రాంత మంతా ఆదివాసీ నినాదాలతో దద్దరిల్లింది. శాంతియుతంగా నిర్వహించిన ఈ మార్చ్--ముట్టడి కార్యక్రమం విజయవంతం కావడంతో తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఆదివాసుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, తక్షణమే చర్చలు జరిపి న్యాయం చేయాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు.

## మూడు రోజులుగా నీటి సరఫరా బంద్. సొంత ట్యాంకర్‌తో ఉచితంగా తాగునీరు

- 48వ డివిజన్ ప్రజల ఇబ్బందులకు స్పందించిన మాజీ కార్పొరేటర్ తోట



**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం:**48వ డివిజన్‌లో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజల సమస్యలను గుర్తించిన స్థానిక మాజీ కార్పొరేటర్ తోట రామారావు స్పందించారు.

డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, సారధినగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో తన సొంత ట్యాంకర్ ద్వారా ఉచితంగా తాగునీటిని సరఫరా చేశారు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ తోట రామారావు మాట్లాడుతూ, మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని పేర్కొన్నారు.

అలాగే 3వ టౌన్ ప్రాంతానికి ఆయుపట్టుగా ఉన్న రంగనాయకుల గుట్టలోని నీటి చప్టను అనాలోచితంగా కూల్చివేయడం వల్ల భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు పునరాలోచన చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులను తక్షణమే పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఏర్పడకుండా నీటి సరఫరా నిలిచిపోయే ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో చేతి కృష్ణ, ఎ.కే.బాబా కృష్ణ నా యక్, నిరంజన్, లింగారెడ్డి, తోట రమేష్, వేల్పుల శ్రీనివాస్, చింటూ, కుమారి, సైదమ్మ, రమాదేవి,
నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సేవే లక్ష్యం.. రైతు విశ్రాంతి భవనం నిర్మిస్తాం

- వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్
- మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు తీర్మానాలు
- త్వరలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అనుమతితో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం 3వ సమావేశం చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు.సమావేశంలో వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్లు మార్కెట్ అభివృద్ధి, రైతులకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు ధాన్యం విక్రయించిన అనంతరం వివిధ కారణాల వల్ల సొంత గ్రామాలకు వెళ్లడంలో ఆలస్యం కావడం, తూకాల్లో ఆలస్యం వంటి సందర్భాల్లో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సమావేశంలో చర్చించారు.

### - రైతుల కోసం ప్రత్యేక విశ్రాంతి భవనం

రైతులకు రాత్రివేళల్లో బస చేసేందుకు వీలుగా రైతు విశ్రాంతి భవనం నిర్మించాలని పాలకవర్గం తీర్మానం చేసింది. అలాగే మార్కెట్ కమిటీకి చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ గోడలు నిర్మించడం, రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మార్కెట్ యార్డులో బెంచీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తూ మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తామని చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ పేర్కొన్నారు. త్వరలోనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### - రైతులతో కలిసి సహపంక్తి భోజనం

సమావేశం అనంతరం మార్కెట్ యార్డులో రైతులకు ఉచిత భోజన కార్యక్రమం నిర్వహించారు. పాలకవర్గం సభ్యులు రైతులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రైతులకు ఉచిత భోజనం ఏర్పాటు చేయడంపై చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను రైతులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్లు విజేందర్ రెడ్డి, ప్రభాకర్, పాండురంగారెడ్డి, రంగారెడ్డి, రమేష్ నాయక్, రాజునాయక్, పాపిరెడ్డి, మిర్యానం సురేష్, నాగిరెడ్డి, బీమయ్య, వట్టం నర్సిములు
తదితరులు పాల్గొన్నారు.

# దూషించాలని కేసీఆరే పురిగొల్పి పంపించారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. చీకటి మిత్రులను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో చర్చలు జరిగిన తర్వాతే నిర్ణయాలు జరుగుతాయని.. నిర్ణయాలు జరిగిన తర్వాత చర్చలు జరగవని స్పష్టం చేశారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. బీజేపీ లేవనెత్తిన అంశాలపైనా చర్చ జరుగుతుందన్నారు. స్పీకర్ చైర్‌ను అవమానిస్తే స్పందించాల్సిన అవసరం బీజేపీకి లేదా అని ప్రశ్నించారు. సభ్యుల హక్కులను కాపాడే స్పీకర్‌ను అవమానించారని మండిపడ్డారు.అత్యంత అవమానకరంగా స్పీకర్‌నుద్దేశించి మాట్లాడితే.. ఇంతకంటే చర్చకు ప్రాధాన్యమున్న అంశం ఇంకేముంటుందని సీఎం అడిగారు. ఇది స్పీకర్ చైర్ గౌరవానికి సంబంధించిన విషయంగా చెప్పుకొచ్చారు. సభాపతి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీఆర్ఎస్ వేసిన అపవాదు, దుర్మార్గాలను బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. సమాజం తలదించుకునేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు చీకటి రోజని అన్నారు. ఇది 4 కోట్ల మంది తెలంగాణ



ప్రజలకు జరిగిన అవమానమని తెలిపారు. దూషించాలని కేసీఆరే పురిగొల్పి పంపించారని ఆరోపించారు. సభ్య సమాజం సహించలేని భాష మాట్లాడారంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితులు, గిరిజనులే కాదు.. సభ్య సమాజానికే జరిగిన అవమానం ఇది అని ముఖ్యమంత్రి అన్నారు. ఇవాళ తెలంగాణ ఆత్మగౌరవానికే గాయమైందని.. స్పీకర్‌పై అత్యంత అసభ్యకరంగా మాట్లాడారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక దళిత వ్యక్తిని సీఎం చేస్తానని, దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. దళిత ఉప ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసిన ఘనత కేసీఆర్‌ది అంటూ వ్యాఖ్యానించారు. సభాపతిని దూషించడం అందరికీ అవమానకరమన్నారు. స్పీకర్‌పై అభ్యంతరకరంగా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును సమర్థించాలని బీజేపీ చూస్తోందా అని ప్రశ్నించారు. అందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయమిది అని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని సూచించారు. దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా చూడలేక పోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక ఆలోచనను సరిదిద్దకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవన్నారు. ఈ రకమైన అవమానం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశానికి సంబంధించి కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌ను అభ్యంతరకర భాష మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలన్నారు. లేకపోతే బర్తరఫ్ చేయాలన్నారు. తాము ఏం మాట్లాడినా వెనుక కేసీఆర్ ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యేల ఆందోళనలతో వాయిదా పడిన తెలంగాణ శాసనసభ తిరిగి మొదలైంది. ఈ సందర్భంగా స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దుర్భాషలాడారని మండిపడ్డారు. తాతా మధు వ్యాఖ్యలపై అందరం మనస్తాపం చెందామని.. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే అని తెలిపారు. స్పీకర్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత బీజేపీకి లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ చైర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని.. స్పీకర్‌ను దూషించడం దుర్మార్గమని మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడంపై బీజేపీ వైఖరి చెప్పాలని.. ఆయనకు జరిగిన అవమానంపై ఆ పార్టీ మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్



**హైదరాబాద్, సెప్టెంబర్ 7:** శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా అవమానించారంటూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్థానానికి కనీస గౌరవం ఇవ్వకుండా 'ఎవడ్రా', 'స్పీకర్ గాడు' అంటూ ఏకవచనంతో సంబోధించడమే కాకుండా, 'అధికారం ఇచ్చిన వాడు ఎవడ్రా' అంటూ తీవ్ర అసభ్య పదజాలంతో బూతులు తిట్టడం బీఆర్ఎస్ నేతల అహంకారానికి, దళిత వ్యతిరేక మనస్తత్వానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు అత్యంత తీవ్రంగా పరిగణించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అసభ్యకర పదజాలంతో దూషించిన తాతా మధును తక్షణమే ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఎంను కోరారు. మరోవైపు ఈ ఘటనపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను అవమానించిన సదరు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మహాభారతం చూపెట్టిండు



**హైదరాబాద్ :** రాహుల్ గాంధీ అదానీ, నరేంద్రమోదీ ఫొటోలు వేసుకుంటే తప్పు లేనిది.. మేము కాంగ్రెస్ హామీల గురించి నల్లచొక్కా వేసుకుంటే తప్పయిందా..? అని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని మన్నె క్రిశాంక్ తీవ్రంగా ఖండించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో అదానీ టీ షర్ట్ వేసుకుని పోయిన్రు కదా.. హరీశ్ రావు ఏడు సార్లు ఎమ్మెల్యే.. ఇప్పటివరకు ఓడిపోయింది లేదు.. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఆయనను మీరు కింద పడేస్తరు.రేవంత్ రెడ్డి అయినా ఎన్నికల్లో ఓడిపోవచ్చు కానీ సబితా ఇంద్రారెడ్డి ఏనాడు కూడా ఓడిపోలేదు. వారి జుట్టు పీకుతరు..పోలీసులు జుట్టు లాగడం చూశాం.. రాష్ట్రంలో ఉన్న మహిళలు చూస్తున్నరు.. ఇందిరమ్మ పేరు పెట్టి సిగ్గు తీస్తున్నవ్ కదా రేవంత్ రెడ్డి.. ఇందిరమ్మ బ్రేక్ ఫాస్ట్ అంటవ్..అది బంద్ ఉంటది.. ఇందిరమ్మ చీరటలంటవ్..అవి పంపిణీ ఉండదు.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఎమ్మెల్యేల జుట్టు లాగుతరా..? సునితమ్మ చీర లాగుతరా..? అని ప్రశ్నించారు. ఇవాళ పుస్తకాల్లో చదివిన మహాభారతం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చూపెట్టిండు. కౌరవులందరు కలిసి అక్కడ మహిళలను అవమానపరిచారు. కౌరవ కాంగ్రెస్ అందరూ అక్కడ మహిళలను అవమానపరిచారన్నారు.

# అసెంబ్లీలో రచ్చ బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం


**హైదరాబాద్, సెప్టెంబర్ 7:** 22-ఏపై చర్చకు బీజేసీప సభ్యుల పట్టు భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు బీఆర్ఎస్ తో బీజేపీ కుమ్మక్కయిం దన్న కోమటిరెడ్డి తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22-ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో సభాప్రాంగణంలోకి దూసుకెళ్లారు. స్పీకర్ కల్పించుకుని... బీఏసీ సమావేశంలో చర్చించి 22-ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిం చాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు.మరోవైపు, బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష



కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడు తోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమ టిరెడ్డి మండిపడ్డారు.మరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22-ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# అసెంబ్లీ చరిత్రలో ఈరోజు బ్లాక్ డే - మహిళలు అని చూడకుండా దారుణంగా ప్రవర్తించారు:

**హైదరాబాద్ :** అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఇది ఆడ బిడ్డల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆమె పేర్కొన్నారు. అసెంబ్లీ చరిత్రలో ఈరోజు బ్లాక్ డే అని ఇదో దుశ్శాసన పర్వంగా భావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అని చూడకుండా దారుణంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలోనికి వెళ్లే సందర్భంలో పోలీసులకు బీఆర్ఎస్ నేతలకు మధ్య జరిగిన తోపులాట ఆమె చీరను లాగారని సునీత లక్ష్మారెడ్డి ఆరోపించారు.సీఎం బాధ్యత వహించాలి : తనకు బయటకు చెప్పుకోలేని అవమానం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు



చెప్పాలని సునీతా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమాధానం చెప్పలేక తమను అడ్డుకుంటుందని అన్నారు. సీఎం ఆదేశాలతోనే ఇలా జరిగిందని అనుకుంటున్నామని మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు సీఎం బాధ్యత వహించాలని, తమకే కాదు రాష్ట్ర మహిళలందరికీ సీఎం క్షమాపణలు చెప్పాలని స్పష్టం చేశారు.అసెంబ్లీ గేటు వద్దకు వెళ్లకుండానే : ఈరోజు అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటన హేయమైనదని సబిత ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యేలు ధరించిన నల్ల టీషర్టులపై ఏముందో అర్థం కావట్లేదని ఆమె అన్నారు. టీషర్టుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వ్యాఖ్యలు ఉంటే అసెంబ్లీ గేటు వద్దకు వెళ్లకుండానే అడ్డుకున్నారని చెప్పారు. శాసనసభ చరిత్రలోనే ఇలాంటి ఘటన ఎన్నడూ చూడలేదని అన్నారు. మహిళలంటే సీఎంకు గౌరవం లేదని ఆరోపించారు.పోలీసులు రాజ్యం నడుస్తోందా? : బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతులు నొక్కాలని సీఎం ఆదేశం ఇచ్చారా? అని సబిత ప్రశ్నించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగేశారని, ఇది తమకు జరిగిన అవమానంగా భావించట్లేదని రాష్ట్ర మహిళలకు జరిగిన అవమానంగా చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందా? అని ధ్వజమెత్తారు. మహిళల చీర, జుట్టు పట్టుకుని లాగడం ఏంటి? ప్రశ్నించిన వారి గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చిన మహిళా సభ్యులుకే రక్షణ లేకపోతే రాష్ట్ర మహిళలకు భద్రత ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవద్దు..




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవద్దని రాష్ట్ర డీజీపీకి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ విచారించిన హైకోర్టు ఈ అంశంపై పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, కేసును రెండు వారాలకు వాయిదా వేసింది.కాగా, సోమవారం కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరిగింది. మహళా ఎమ్మెల్యేలు అని చూడా కూండా జుట్టు పట్టి, చీరలాగి అమానవీయంగా ప్రర్తించారు. పోలీసుల తీరును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

# దిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న అరెస్టు

**ఆదిలాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టుల ను నిరసిస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని నిర్మల్, ఆదిలాబాద్ రహదారిపై మాజీ మంత్రి జోగు రామన్నఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుందమాజీ మంత్రిని అరెస్టు చేసిన పోలీసులు వాహనంలో



తరలిస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు వాహనానికి అడ్డుగా నిలిచారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను పక్కకు జరిపి వాహనాన్ని ముందుకు తీసుకుపోతుండగా మరో పలుమార్లు అడ్డుకున్నారు.మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతుంటే వారిపై దౌర్జన్యం చేయ డం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేం తవరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడించారు.

# అసలు రాష్ట్రంలో 22ఏ సమస్య ఎందుకొచ్చింది అధికారులను ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ :** భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మం త్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను పలు ప్రశ్న లు అడిగినట్లు తెలిసింది."గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా? 22ఏ సమస్య ఎందుకొచ్చింది? వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి? అని సీఎం అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ సెక్రటరీ లోకేశ్? కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది. 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొన్నారు. నిషేధిత భూముల జాబితాను అప్‌డేట్ చేయాలంటూ హైకోర్టు



ఇచ్చిన ఆదేశాల మేరకే గతేడాది చివర్లో జిల్లా కలెక్టర్లు సంతకాలు చేసిన ప్రతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని సీఎంకు వివరించారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉత్పన్నమయ్యాయి? ఏ మేరకు పరిష్కరించామనే వివరాలను కూడా ఆయన సీఎంకు చెప్పారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే సమస్య ఎక్కువగా కనిపించిందని, వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ భూ సమస్యల పరిష్కారంపై ఎక్కువగా దృష్టి సారించాలంటూ సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పలువురు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.మంత్రి పొంగులేటి సమీక్ష : నిషేధిత భూముల జాబితా అంశం అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను ఈ వేదికగా ప్రజలకు వెల్లడించేందుకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇప్పటికే సిద్ధం అయ్యారు. హైకోర్టు ఆదేశాలతో 2025 చివర్లో జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్ చేసింది. ఈ క్రమంలో కొన్ని ప్రైవేట్ ఆస్తులు ప్రతిపక్షాలు గట్టిగా ప్రశ్నిస్తూ వస్తున్నాయి. పాత జాబితాలో ఏ వివరాలు ఉన్నాయి? కొత్తగా అప్‌లోడ్ చేసిన జాబితాలో ఉన్న వివరాలు ఏంటనేది శాసనసభలో మంత్రి పొంగులేటి వివరించనున్నట్లు సమాచారం. ఈ అంశాలపై మంత్రి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సుదీర్ఘంగా సమావేశం నిర్వహించారు. 22ఏ జాబితాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఈ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయంటూ పలుచోట్ల భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరించారు. ప్రధానంగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా 980 వరకు వచ్చాయి. వీటి పరిష్కారానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల సెక్రటరీలతో ప్రభుత్వం హై లెవల్ కమిటీని నియమించింది. ఈ క్రమంలో శాసనసభలో విపక్షాల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ పూర్తిగా సన్నద్ధం అయ్యింది. సభ్యులు 22ఏ సంబంధిత ప్రశ్నలు వేస్తే వాటికి సరైన జవాబు అందించే విధంగా జిల్లాల పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్నారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

## హెచ్ఎల్సీ, హంద్రీనీవా నీరంతా తాగునీటికే అంటే ఎలా?



తుంగభద్ర ఎగువ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం కలెక్టరేట్ ప్రాంగణం వద్ద రైతులతో కలిసి మాజీ మంత్రి, వైసీపీ నేత సాకే శైలజానాథ్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాభావంతో ఎండిపోయిన వేరుశనగ, కంది పంటల మొక్కలను చేతుల్లో పట్టుకుని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. శింగనమల నియోజకవర్గ పరిధిలోని ఆయకట్టు భూములను ఎండబెట్టడం దారుణమని, హెచ్ఎల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టుల నీటిని కేవలం తాగునీటి అవసరాలకే కేటాయిస్తామనడం పాలకుల అనాలోచిత విధానాలకు అద్దం పడుతోందని శైలజానాథ్ మండిపడ్డారు. నీటి పంపకాల విషయంలో ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని, సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి పేరుతో సాగునీటిని పూర్తిగా నిలిపివేస్తే అన్నదాతలు ఏమైపోవాలి? రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి ఉందా? అని శైలజానాథ్ సూటిగా ప్రశ్నించారు. శింగనమల నియోజకవర్గానికి తక్షణమే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని, లేనిపక్షంలో అనంతపురం జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని ఏకం చేసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

**హైదరాబాద్ :** స్వర్ణభారత్ ట్రస్ట్ పేదపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వారి కోసం అన్ని రకాల వసతులూ కల్పిస్తోందని చెప్పారు. పేదపిల్లలకు చదువు చెప్పడం అనేది గొప్ప సమాజ సేవన్నారు. యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'కరోనా మహమ్మారి వల్ల అనేకమంది తల్లిదండ్రులు చనిపోయారు. అనాథ పిల్లలకు యూపీలో అటల్ ఆవాస్ విద్యాలయ్‌లో ఉచిత విద్య. మా గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పనకు వెంకయ్యనాయుడే స్ఫూర్తి. సాంకేతికత పరిజ్ఞానాన్ని సమర్థంగా వాడుకునే దేశమే ముందుకెళ్తోంది. ఎంత చదువుకుని, ఉన్నతస్థానానికి వెళ్లినా దేశం పట్ల భక్తి ఉండాలి, ఎక్కడికి వెళ్లినా నేషన్ ఫస్ట్ అనే భావన అందరిలో ఉండాలని' యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్‌తోపాటు



తదితరులు హాజరయ్యారు."స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం. సమాజసేవకు వెంకయ్యనాయుడు తీసుకున్న సంకల్పం గొప్పది. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విద్య తోపాటు నైపుణ్య శిక్షణనూ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల యువత, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉత్తరాదికి, దక్షిణాదికి వారధిగా వెంకయ్యనాయుడు పని చేశారు. మన పల్లెలు జ్ఞానానికి, ఆర్థికాభివృద్ధికి మూలకేంద్రాలు. ఒకప్పుడు మన గ్రామాలన్నీ స్వయంపోషకాలుగా ఉండేవి. అందుకే గ్రామాలకు తరలండి అంటూ గాంధీజీ పిలుపునిచ్చారు. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం జాతి నిర్మాణానికి సాయం చేయడమే. ఎక్కడికి వెళ్లినా భారతీయులం అంటూ గర్వంగా చెప్పుకోవాలి. గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ సదుపాయాలు ఉన్నాయి." – యోగి ఆదిత్యనాథ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిఅంతకుముందు అక్షర విద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద యోగి ఆదిత్యనాథ్‌కు ట్రస్ట్ నిర్వహకులు, నేతలు స్వాగతం పలికారు. అనంతరం సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఆదిత్యనాథ్ సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యువతకు ఇస్తున్న సాంకేతిక శిక్షణ, నైపుణ్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. అక్షర విద్యాలయ నిర్వహణను యోగి ప్రశంసించారు. మాతృభూమికి సేవ కోసం : గ్రామీణ సాధికారత, వికాసమే లక్ష్యంగా, సేవే పరమావధిగా పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మానస పుత్రికగా 2001లో ఆయన మిత్రులు 8 మంది మాతృభూమికి సేవ చేయాలన్న సంకల్పంతో దీనిని ప్రారంభించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నెలకొల్పిన ట్రస్ట్ సేవలు బహుముఖంగా విస్తరించాయి. విజయవాడ సమీపంలోని ఆత్కూరు, హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లోనూ స్వర్ణభారత్ ట్రస్ట్ శాఖలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున శిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

## వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం.

**అమరావతి:** రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్య మంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీ నీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి



చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యంపొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండిగత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.


## జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ క్రైమ్ పార్ట్‌నర్స్



**అమరావతి:** రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు యత్నాలపై ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కు అందరికీ ఉందని, అయితే దశాబ్దాల పాటు ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచుకున్న వ్యక్తి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పార్టీ పెడుతున్నాడో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధినేత జగన్ అక్రమ ఆస్తుల కేసుల్లో విజయసాయిరెడ్డి ఏ-2గా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు."జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ నేరాలు చేయడంలో పార్ట్‌నర్స్" అని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల హయాంలో విచ్చలవిడిగా సాగిన నాసిరకం, అక్రమ మద్యం సరఫరా వల్ల రాష్ట్రంలో ఏకంగా 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది తీవ్ర అనారోగ్య పాలయ్యారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేయడంతో పాటు వేలాది నాశనానికి కారణమైన జగన్, విఇద్దరూ ప్రజల కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని అన్నారు.

## కొత్త రాజకీయ పార్టీ అజెండాపై విజయ సాయిరెడ్డి ఏమన్నారంటే.

**విజయవాడ, సెప్టెంబర్ 7 :** తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండా ప్రకటించే ముందు ప్రజలకు సంబంధించిన అంశాలను వివరిస్తానని మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీలో మూడవ ప్రత్యమ్నాయం అవసరాన్ని ప్రజలకు వివరిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, వైసీపీ, జనసేన పార్టీలు ప్రధానంగా ఉన్నాయని ప్రస్తావించారు. ఈ పార్టీలన్నీ ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు. విజయవాడలో ఈరోజు (సోమవారం) విజయసాయిరెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.ఆ మూడు



పార్టీల్లో ఆ పరిస్థితి లేదు..ప్రజల సమస్యల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే పరిస్థితి ఆ మూడు పార్టీల్లో లేదని విజయ సాయిరెడ్డి చెప్పుకొచ్చారు. రాష్ట్ర రాజకీయం రెండు పార్టీల చుట్టురానే తిరుగుతున్నాయని అన్నారు. ఈ రెండు రాజకీయ పార్టీలు ఫ్యాక్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం వైసీపీ, టీడీపీ పార్టీల మధ్య యుద్ధం జరుగుతోందని అన్నారు. గోరంత... తమకు కొండంత అనే విధంగా వ్యవహారిస్తాయని విజయ సాయిరెడ్డి విమర్శించారు.

## నాయకులు అహంకారానికి దూరంగా ఉండాలి: ఎంపీ రామ్మోహన్ నాయుడు

నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్న రామ్మోహన్ అభ్యర్థి ప్రవర్తన ఎన్నికల్లో 68.9% ప్రభావం చూపుతుందని వెల్లడి ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచన ఎంత ఎదిగినా అహంకారం దగ్గరకు రానీయవద్దని హితవు టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో కేంద్ర మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగం చేశారు. నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ పటిష్ఠంగా ఉంటుందని, ప్రజా జీవితంలో ఉన్నవారు తమ ప్రవర్తన విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఎన్నికల్లో అభ్యర్థి ప్రవర్తన 68.9 శాతం వరకు గెలుపోటములను ప్రభావితం చేస్తుందని



పలు సర్వేలు చెబుతున్నాయని రామ్మోహన్ నాయుడు గుర్తుచేశారు. ఉత్తమ పనితీరుతో నాయకత్వాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చూసి నేర్చుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు నిరంతరం ఓటర్లు, పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని, ముఖ్యంగా జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా మన కార్యాచరణ ఉండాలని పిలుపునిచ్చారు. కేవలం సమస్యలను గుర్తించడమే కాకుండా, వాటిని వేగంగా పరిష్కరించే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రజల సమస్యలను ఓపికగా వినే సహనం నాయకులకు చాలా అవసరమని అన్నారు.నాయకుడిగా ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా అహంకారాన్ని దరిచేరనీయవద్దని రామ్మోహన్ నాయుడు హితవు పలికారు. ప్రవర్తనే నాయకుడికి అసలైన కొలమానమని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## పార్టీ ఇచ్చిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే

**అమరావతి, సెప్టెంబర్ 7 :** పార్టీయే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులైనా.. ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని ఆదేశించారు. పార్టీయే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులైనా..ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు ఈరోజు (సోమవారం), రేపు (మంగళవారం) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు.పార్టీ ఏదైనా పని చెబితే.. దానికే ప్రయారిటీ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. క్వాంటం టవర్స్‌కు సంబంధించిన ఓ కార్యక్రమం ఉందని తనను ఆహ్వానిస్తే... పార్టీ తనకో పని అప్పచెప్పిందని... తాను రానని స్పష్టం చేశానని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన పనులను కంపల్సరీ చేయాల్సిందే... దానికే హై ప్రయార్టీ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ పదవుల్లో



ఉన్న వారు.. పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడానికి ఎవరి అనుమతి అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు బీ-ఫారం ఇవ్వకుంటే మంత్రులు కాలేరని, ఎమ్మెల్యేలు కారని తేల్చిచెప్పారు.పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదనే విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయనేది నిరంతరం సమీక్షించుకుంటూ వెళ్లాలని సూచించారు. మై-టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను పూర్తిగా అప్ డేట్ చేస్తున్నామని వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

## ఇలాంటి పోలీసులు ఉన్నందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి




**అమరావతి :** గుంటూరు బాలిక మిస్సింగ్ కేసులో ఏపీ పోలీసులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి పోలీసులు ఉన్నందుకు ప్రభుత్వం సిగ్గుపడాలంది. మూడు నెలలైనా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోయారు. ఇంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా కూడా ఒక బాలిక ఆచూకీని కనిపెట్టలేకపోతున్నారా? అసలు మీరు విచారణ చేస్తున్నారంటే మేము నమ్మాలా? అని ప్రశ్నిం చింది. బాలికను రేపటిలోగా పరచాలని ఉన్నత న్యాయస్థానం డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది.